

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

23

**వాణికి ఎంతో** ఆశ్చర్యం వేసింది. ముకుందానికి వీసా ఇవ్వకుండా బ్లాక్ లిస్ట్లో ఉంచారని తెలియగానే అమెరికన్ గవర్నమెంట్‌కి ఎవరయినా రిపోర్ట్ చేస్తే కానీ ఆ పని చేయరు. ఎవరు చేసి వుంటారు?

తన తండ్రి.

వాణికి తన ఆలోచన సబబని తట్టగానే ఆయన ఏ పాయింట్ మీద రిపోర్ట్ చేసి వుంటాడా అని ఆలోచించింది.

వెంటనే తన గదిలోని బ్రౌన్ కలర్ కవర్‌ని తెరచి అందులోంచి ముకుందం రాసిన ఉత్తరాలని బయటికి తీసి చూసింది. వాటిలో ముఖ్యమైన ఉత్తరం మిస్ అయిందని గ్రహించింది. ముకుందం తనని పెళ్ళి చేసుకునే ఉద్దేశంతో స్వదేశంలోని తన తల్లిదండ్రులని వదిలిరావడానికి సిద్ధపడ్డానని, అందుకు బీ టెన్ ట్రాక్ స్టూడెంట్‌గా అమెరికా రావడం కాబట్టి వాణి సలహా మీద తను టోఫెల్‌కి అప్పీయర్ అవుతానని రాసిన ఉత్తరం అందులో కనపడలేదు.

వాణి ఆ కవర్ విసిరికొట్టి రీసీవర్ అందుకుని తన తండ్రి ఆఫీస్ నంబర్ తిప్పింది. ఆయన ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని సమాధానం వచ్చింది. తల్లి దగ్గరికి వెళ్ళి చెప్పింది.

"ముకుందానికి స్టూడెంట్ వీసా రాలేదు."

"ఆ విషయం నాకెందుకు చెప్పుతున్నావు?" అదిగింది లక్ష్మి.

"ఈ బుద్ధి నీకు పుట్టిందా, నాన్నకా అని తెలుసుకోవాలని."

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడంలేదు."

"నాకు ముకుందం రాసిన ఉత్తరాన్ని మద్రాస్‌లోని అమెరికన్ కన్సులేట్ కార్యాలయానికి పంపిస్తూ, ముకుందం అమెరికాలో సెటిల్ అవడానికే స్టూడెంట్‌గా వస్తున్నాడని, అతనికి వీసా ఇవ్వకూడదని రాసింది నువ్వా, లేక నాన్నా?"

లక్ష్మి మొహం కొద్ది క్షణాలు పాలిపోయింది. వెంటనే తేరుకుని చెప్పింది.

"అసలు నీకు ముకుందం ఏం రాశాడో మాకెలా తెలుస్తుంది?"

"దొంగతనంగా వాడిని చదవబట్టి."

"అందులో ఏం రాశాడేమిటి?"

"నన్ను పెళ్ళి చేసుకోవాలంటే అమెరికాకి వచ్చి తీరాలి కనక స్టూడెంట్‌గా వస్తానని?"

"ఓ మళ్ళీ ఆ ఆట మొదలెట్టావన్నమాట" అడిగింది లక్ష్మి కోపంగా.

"ఇండియన్‌ని చేసుకుంటే ఏం అభ్యంతరం మీకు?"

"మీ నాన్ననే అడుగు. ఆ ఉత్తరం గురించి నాకేం తెలీదు. ఎక్కడ పారేసుకున్నావో సరిగ్గా వెతుక్కో."

"ఛీ! మీరు మనుషులు కారు."

వాణి పెద్ద పెద్ద అంగలు చప్పుడయ్యేలా వేసుకుంటూ తన గదిలోకి వెళ్ళి బలంగా తలుపు మూసింది. వాణి కళ్ళవెంబడి నీళ్ళు కారసాగాయి. పెదవులు, గడ్డం అదరసాగాయి. దాదాపు పావుగంటదాకా నిశ్శబ్దంగా ఏడుస్తూండిపోయింది. ముకుందం అమాయకమయిన మొహం, అతని లాంటి సాదాసీదా వ్యక్తిలోంచి వచ్చిన నైనిటీస్ గుర్తుకు వచ్చాయి.

'నువ్విలాంటి వాక్యాలు రాయగలవనుకోలేదు' అని తను రాస్తే ముకుందం సమాధానంలో రాశాడు.

'మన మనసుకి నచ్చిన వ్యక్తి తారసపడ్డప్పుడు ఇలాంటివి బయటికి వస్తాయనుకుంటాను. నాకే తెలీదు ఇలాంటి భావాలు నీ ముందు గోదారి వెల్లువే అవుతాయని.'

వాణి ఆ కవర్లోని ఉత్తరాలన్నీ తీసి ముకుందం రాసినవి మళ్ళీ మొదటి నించీ చదువుకుంది.

'బాపు నిన్ను గీశారా?'

'నువ్వు ఉదయం నిద్రలేస్తే సూర్యుడు ప్రకాశించడానికి అది సరయిన కారణం అవుతుంది.'

'భూమిని  వదలకుండా నన్ను స్వర్గానికి తీసుకెళ్ళగలిగేదేమిటో తెలుసా? 'ఐ లవ్ యూ' అన్న నీ మాటలు.

"ఐ లవ్ యూ. ఐ లవ్ యూ థౌజండ్ టైమ్స్" చెప్పింది వాణి ఆ వాక్యం చదవగానే బయటికి.

టెలిఫోన్ మోగింది. కొద్ది క్షణాల తర్వాత తలుపు మీద టకటకా చప్పుడైంది. అది ఆమెకే అన్న గుర్తుగా.

"హాయ్? వాణి స్పీకింగ్."

రిసీవర్ అందుకుని చెప్పింది.

"ఏమ్మా? ఇందాక ఫోన్ చేశావుట దేనికి?" వెంకటేశ్వరరావు కంఠం వినబడింది హాస్పిటల్ నించి.

డేడీ, జెంటిల్‌మేన్ డోన్ట్ రీడ్ అదర్స్ మెయిల్" చెప్పింది వాణి.

ఆయన బిత్తరపోయి మౌనంగా ఉండిపోయాడు. వాణి ఎక్స్‌టెన్షన్ రిసీవర్‌ని పెట్టేసింది.

బయట మెయిన్ ఫోన్‌లోంచి వింటున్న లక్ష్మి చెప్పింది తన భర్తతో వాణి ఫోన్ పెట్టేయగానే.

"మీరు మద్రాస్ అమెరికన్ కన్సులేట్‌కి ఆ లెటర్ పంపిన సంగతి వాణికి తెలిసిందండీ."

"నువ్వు చెప్పావా?"

"ఉహూ. అతని పేరు బ్లాక్ లిస్ట్‌లో పెట్టి వీసా ఇవ్వలేదుట. దీనికి మిమ్మల్నీ. నన్నూ మింగేంత తెలివితేటలు. ఇట్టే గ్రహించింది."

"పోనీలే, పనయిందిగా. ఇక ఆ వెధవ (వెధవ ముందు ముకుందము కులం పేరు చేర్చాడు వెంకటేశ్వరరావు) అమెరికాకి రాలేడన్నట్లేగా?"

"నేను ఇంటికొచ్చాక ఇది గొడవ పెడుతుందా?"

"అలాగే ఉంది దాని తరహా"

"సరే. నువ్వేం దాంతో పోట్లాడక. అదేమన్నా మౌనంగా వుండు."

"అసలే తిక్కది."

లక్ష్మి రిసీవర్ పెట్టేసింది.

రోజులా రాత్రి ఏడున్నరకి వచ్చాడు వెంకటేశ్వరరావు ఏం జరగనట్లే ప్రవర్తించాడు. డైనింగ్ టేబుల్ ముందు వాణి కూడా ముకుందం టాపిక్ తీసుకురాలేదు. మౌనంగా భోజనం చేసింది.

"ఇంకాస్త పెరుగు వేసుకో" చెప్పాడు వెంకటేశ్వరరావు వాణితో.

"నాకేం కావాలో నాకు తెలుసు డేడీ. ఒకరు చెప్పాల్సిన పనిలేదు" కరకుగా జవాబు చెప్పింది.

"అలా అయితే సారీ"

"ఒకటి గుర్తుంచుకోండి మీ యిద్దరూ. ముకుందం ఇక్కడికి రాకపోతే నేనే ఇండియా వెళ్తాను. అక్కడ అతన్ని పెళ్ళి చేసుకుని నా భర్తగా పిలిపించుకుంటాను."

"వాణీ! ఊరికే స్టేన్లీ బ్రాడ్‌బరీ విషయంలోలా మొండిచెయ్యక."

"వై డు యూ ఇంట్రూడ్ ఇన్ టు మై ప్రైవేట్ లైఫ్ డేడీ?"

"డేమ్ నాన్సెన్స్. నువ్వు సగటు తెలుగువాడి కూతురివి తప్ప అమెరికన్ కూతురివి కాదు. నీకంటూ ప్రైవేట్ లైఫ్ లేదు. మేం కుదిర్చిన సంబంధం చేసుకుతీరాలి నువ్వు ఒకరు కాదు. వందమంది పెళ్ళికొడుకుల్ని చూడు ఎవరు నచ్చితే వాళ్ళని చేసుకో. అదీ మన కులం వాడే అయి ఉండాలి. దట్సాల్."

"డేమ్ నాన్సెన్స్ డేడీ నీకు కులం గురించి మాట్లాడే అర్హత లేదు" అరిచింది వాణి కోపంగా లేచి నిలబడి.

"వాణీ!" హెచ్చరించింది లక్ష్మి కోపంగా.

"డేడీ. ఇండియాలో పుట్టి పెరిగిన నువ్వు ఇండియన్‌వి. అమెరికా వచ్చాక కూడా ఇండియన్‌వే. కానీ ఫెడరల్ గవర్నమెంట్‌లో జాబ్ కోసం ఇండియన్ సిటిజన్ షిప్‌ని వదులుకుని అమెరికన్ సిటిజన్‌గా మారిన నువ్వు ఇప్పుడు అమెరికన్‌వి. యూ ఆర్ నో లాంగర్ ఏన్ ఇండియన్."

"అది సౌకర్యం కోసం. నేను ఇండియన్‌ని ఎలా కాకుండా పోతాను?" కోపంగా అరిచాడాయన.

"మాతృభూమికే విడాకులిచ్చిన మనిషివి నువ్వు. నీ స్వార్థం కోసం నువ్వు ఇండియన్ సిటిజన్‌షిప్ వదులుకుని అమెరికన్ పౌరసత్వం ఏనాడు తీసుకున్నావో ఆనాడే నీలోని భారతీయత మంట కలిసింది. ఇంకా నీకు కులం, గోత్రం ఎక్కడున్నాయి డేడీ? డబ్బు వ్యామోహం నీ కులం.. అమెరికన్ సిటిజన్‌షిప్ నీ గోత్రం."

"వాణీ" లక్ష్మి లేచి కోపంగా వెళ్ళి వాణి చెంపమీద కొట్టింది.

వాణి కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే చెప్పింది. "అమెరికా ఎయిర్‌పోర్ట్‌లో అమెరికన్ సిటిజన్స్ క్యూలో, ఇండియన్ ఎయిర్‌పోర్టులో ఫారినర్స్ క్యూలో నిలబడే నిన్ను 'నువ్వెవరు?' అని ఎవరయినా అడిగితే ఏం చేస్తావు? నువ్వు ఇండియన్ అని చెపుతావా? నీ కులం చెపుతావా? నీ గోత్రం చెపుతావా?"

స్టేన్లీ బ్రాడ్‌బరీ విషయంలో కన్నా వాణి ఇంకాస్త తీవ్రంగా తిరగబడటం అంతా గమనించారు.

"వాణీ, గో టు యువర్ రూం" చెయ్యిపట్టి లాగి చెప్పింది లక్ష్మి కోపంగా.

"అమెరికాలో అతని భవిష్యత్తుని ఒక్క ఉత్తరంతో, చెప్పుతో ధనియాల్ని రాసి నలిపినట్లు నలిపేశాను. ఇంక ముకుందం అమెరికన్ బార్డర్‌ని క్రాస్ చెయ్యలేడు." కోపంతో కంపించే కంఠంతో చెప్పాడు వెంకటేశ్వరరావు కూడా లేచి నిలబడి.

"కానీ డేడీ అలా నలిగిన కొప్పెట్టబడ్డ ధనియమే మొలకేసి మొక్కయి సువాసనలు చిందిస్తూ బయటికి వస్తుందని మీకు తెలీదు." రోషంగా చెప్పింది వాణి.

"అంటే?"

"అంటే, ముకుందం అమెరికా వస్తాడు. వచ్చి నన్ను పెళ్ళి చేసుకుంటాడు."

"ఎప్పుడో?" వెటకారంగా అడిగింది లక్ష్మి.

"ఆర్నెల్లలో"

"నో వే" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"టేకిట్ ఫ్రమ్ మి డేడ్, హీ విల్ బి హియర్."

"ఇట్సే ఛాలెంజ్. రాడు రాలేడు రానివ్వను."

"ఇట్సే ఛాలెంజ్. ముకుందం వస్తాడు."

"అలాగా రావడం అంటూ జరిగితే వాడికి కాళ్ళు కడిగి నిన్ను కన్యాదానం చేస్తాను. రాకపోతే?" అడిగాడాయన కోపంగా.

వాణి కొన్ని క్షణాలు సందేహించి చెప్పింది.

"రాకపోతే నువ్వు చెప్పినతన్నే పెళ్ళి చేసుకుంటాను."

"గుడ్ మరి ఆ మాట మీద వుంటారా?"

"మేం ఉంటాం" చెప్పాడు వెంకటేశ్వరరావు.

"నేను కూడా ఉంటాను" చెప్పింది వాణి.

అకస్మాత్తుగా ఆ గదిలోని ఉద్రిక్తత తగ్గింది ఆ ఒప్పందంతో.

"మీరు మాట తప్పితే మాత్రం నేను ఏం చేస్తానో నాకే తెలీదు."

"ఐ విల్ బి జెంటిల్ మేన్ దిస్ టైం" ఒప్పుకున్నాడు వెంకటేశ్వరరావు పావనికి అనిపించింది. తన తల్లిదండ్రులు చేసిన పని సబబైంది కాదని. కానీ వాణిలా అన్నీ బయటికి చెప్పే స్వభావం కాదామెది.

వాణి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

లైబ్రరీకి వెళ్ళింది వాణి. లైబ్రేరియన్‌ని అడిగింది అమెరికన్ ఇమ్మిగ్రేషన్ ఏక్ట్ కావాలని.

కొద్ది క్షణాల్లో ఓ బైండ్ బుక్‌ని అందిస్తూ చెప్పింది లైబ్రేరియన్. "ఇది ఇమ్మాక్ట్ 1990. లేటెస్ట్ ఏక్టు ఇదే"

దాన్ని అందుకుని 'థాంక్స్' చెప్పి వాణి డెస్క్ ముందు కూర్చుని జాగ్రత్తగా చదవసాగింది.

ఇమ్మిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ ఏక్ట్ 1990 జార్జి బుష్ అమెరికన్ ప్రెసిడెంటుగా ఉండగా ప్రవేశ పెట్టిన చట్టం అది.

ఆ రోజు సాయంత్రందాకా దాన్ని దీక్షగా చదువుతూ వాణి తన నోట్‌బుక్‌లో అనేక వివరాలు రాసుకోసాగింది. మర్నాడు కూడా క్లాసుకి హాజరవలేదు వాణి. ఆ పుస్తకమే తీసుకుని పూర్తి చేసింది. వాణి మనసులో క్రమంగా ఓ ఆలోచన, ఓ పథకం రూపుదిద్దుకోసాగింది.

అక్కడ ముకుందం కూడా సరిగ్గా అదేపని చేస్తున్నాడు. ఏ విషయమైనా పట్టుకుంటే దాని అంతు తేలేదాకా వదలకపోవడం ముకుందం స్వభావం. అందువల్ల ముకుందం కూడా వాణిలాగా అమెరికన్ వీసా సిస్టం మంజూరు చేసే పద్ధతిని తెలుసుకోవాలనుకున్నాడు.

హైదరాబాదులోని 'సెంటర్ అమెరికన్ స్టడీస్'కి వెళ్ళి అడిగాడు అమెరికకి వీసా మంజూరు చేసే విధానం గురించిన పుస్తకం ఏదయినా వుందా అని.

అమెరికాలోని లీడింగ్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ రేమన్ కేరియన్ రాసిన 'యు ఎస్. ఏ. ఇమ్మిగ్రేషన్ గైడ్' అనే పేరుగల పుస్తకాన్ని రాబర్ట్ ఎమ్మెట్ లాంగ్ ఎడిట్ చేసిన ఇమ్మిగ్రేషన్ టు ది యు.ఎస్ అనే పుస్తకాన్ని ఇచ్చారు. ముకుందం దాన్ని శ్రద్ధగా చదవసాగాడు.

అమెరికాలో నివాసం ఉండటానికి పర్మినెంట్ రెసిడెంట్ వీసాతో రావటానికి కేవలం రెండే పద్ధతులున్నాయి. ఒకటి ఫేమిలీ స్పాన్సర్డ్. రెండోది ఎంప్లాయిమెంట్ స్పాన్సర్డ్ ఇమ్మిగ్రెంట్‌గా రావడానికి వున్న పద్దతులని శ్రద్ధగా చదివాడు.

ఎఫ్ -1 నుంచి ఎఫ్. 4 దాకా అమెరికన్ సిటిజన్స్ అయిన తల్లిదండ్రులు, పెళ్ళికాని లేదా పెళ్ళయిన తమ పిల్లలని లేదా తమ అక్కచెల్లెళ్ళని, అన్నదమ్ములని అమెరికా పిలిపించుకోవచ్చు. అలాగే అమెరికన్ సిటిజన్స్ అయిన భార్య తన భర్తని, భర్త తన భార్యని కూడా పిలిపించుకోవచ్చు. దానికి సంవత్సరానికి 'ఓ దేశం నించి ఇంతమంది' అనే కోటా సిస్టం ఉంటుంది. ఆ కోటాలో క్యూసిస్టంలో అప్లికేషన్స్ కన్సిడర్ చేస్తారు. తనకు ఫేమిలీ స్పాన్సర్డు ఇమ్మిగ్రెంట్‌గా వెళ్ళే అవకాశం లేదని గ్రహించాడు. అమెరికన్ సిటిజన్స్ అయిన బ్రదర్స్, సిస్టర్స్ కానీ తల్లిదండ్రులు కానీ తనకు లేరు. కాబట్టి, అలాగే వాణితో పెళ్ళి కాలేదు కాబట్టి భర్త స్పోస్‌గా స్పాన్సర్ చేయలేదు వాణి.

రెండోది ఎంప్లాయ్‌మెంట్ స్పాన్సర్డ్ ఇ -1 నుంచి ఇ -6 దాకా వున్న ఏ కేటగిరీలో తన డిగ్రీ క్వాలిఫికేషన్‌తో అమెరికాకి ఇమ్మిగ్రెంట్‌గా వెళ్ళడం కష్టం అని అర్థం చేసుకున్నాడు. సైన్స్ ఆర్ట్సులలో అద్వితయమైన సామర్థ్యం గలవారికి, స్కిల్డ్ వర్కర్స్‌కి మాత్రమే ఈ కేటగిరిలో ప్రవేశం లభిస్తుంది.

అయిదులక్షల డాలర్లు (కోటిన్నర రూపాయలు) నుండి పది లక్షల డాలర్లు దాకా అమెరికాకి తెచ్చి ఇన్‌వెస్టు చేసి అక్కడ కనీసం పదిమందికి ఉద్యోగాలు సృష్టించగలిగితే అమెరికన్ సిటిజన్ అవడం తేలిక. 1ఇ - వీసా కూడా అతనికి అందుబాటులో లేదు.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in